# ౧

బ్లాక్ అవుట్ (Black-out) వెలుగులో క్లబ్బు నిర్జీవంగా నిలబడిపోయింది. ఏటిగట్టున తోటలన్నీ జిమ్మున్నమంటూ ఏకమైపోయాయి. క్లబ్బుమాత్రం, కొత్తసున్నపుగోడలతోటీ, పాలగచ్చు వరండాలతోటీ, చీకటిరాత్రి ఎంత నమిలినా మింగుడుపడక, అస్పష్టంగా అవుపిస్తోంది. గేటుదగ్గర మోటారుహారన్ వినపడగానే కునికిపాట్లుపడుతున్న బోయ్ (Boy) ఉలిక్కిపడి లేచాడు. ఆవేళ కాముదీథియేటరులో, అరండేలుసతి భరత నాట్యానికి క్లబ్బు మెంబర్లంతా వెడుతున్నారని తెలిసికూడా, డాక్టరురాజు, కావాలని, క్లబ్బుకి ఆలస్యంగా వొచ్చినట్టు అవుపిస్తుంది. క్లబ్బులో సందడి ఏమీలేదు. అంతా నాట్యానికి చక్కావెళ్ళేరు. సోనారాణి వొక స్త్రీమాత్రం, ముఖమల్ సోఫా దగ్గరికి లాక్కొని బిలియర్డు టేబిలుమీద తలానించి, మాగన్నుగా నిదరపోతోంది. ఆమె సబ్ జడ్జి 'పాథీ'గారి సతీమణి.

డాక్టరు లోపల అడుగుపెట్టగానే షాంపేనువాసన గుప్పుమంది. కప్‌బోర్డులో అయిస్‌క్రీమ్ బిస్కట్లూ, ఛాకలెట్లూ, ఛిప్సూ, రకరకాల సిరప్పులూ, జిన్నూ, ఇతరమైన ఫలహారాలూ, గట్టా పుష్కలంగావున్నాయి. భరతనాట్య మయిం తరవాత క్లబ్బులో చిన్న పిక్‌నిక్ కూడావుంది గావును అనుకున్నాడు. సోనారాణి పక్కనే, చిన్నస్టూలు మీద, ట్రేలో టీకెటిలు చాలావరకు ఖాళీఅయినా, దాని అట్టడుగున మిగిలిపోయిన స్పెన్సరుటీ గమగమలు మాత్రం గదినింకా వదిలిపెట్టలేదు.

“బోయ్—” అని పిలిచాడు డాక్టరు.

క్షణంలో వచ్చి వ్రాలాడు.

సోనారాణి వంక చూచి ఒకర్తీ ఎందుకుండి పోయిందన్నట్టు తలపంకించాడు. బోయ్ సమాధాన మిచ్చాడు.

“అమ్మగారికి తలనొప్పిగావుండి...”

ఇక అర్థమయిందని వారించాడు డాక్టరు, ఆమెకి నిద్రాభంగమవుతుందనో యేమో. తరవాత గ్లాసులో మిగిలిన షరబత్తు బోయ్ కిచ్చి :

"చూడు—ఇది తాగేసి ఛెస్ బోర్డూ గట్రా సర్దెయ్యి-తలుపులు తీసి పడుకోకుమీ" అని హెచ్చరించి, సర్జికోటు వేశేసుకుంటున్నాడు, వెళ్ళిపోడానికి సిద్ధపడుతున్నట్టు. పరబత్తు వాసన తగలగానే బోయ్‌కి నిదర తేలిపోయింది. కాని గ్లాసు డాక్టరు తనకందించే ముందు, నాలుగు చిన్ని చుక్కలు గూడా, రహస్యంగా మిళాయించినట్టు వాడికి తెలియదు పాపం. వాడికి తెలియకపోయినా దానిపని అది మానలేదు. పక్కగదిలో క్యారమ్సుబిళ్లలు అయివరీ కేసులో సర్దబోయి, తెరిచివున్న అద్దాల బీరువా తగిలి, తూలి జారగిలపడ్డాడు. ఆ పడక పడక పరిచివున్న హెక్సాగనల్ టేబిలుమీద, చెదిరిపడిన చైనావేస్ పింగాణీ ముక్కలమధ్య, తెరిచివున్న ఓరియంట్ మేగజీన్‌లో, బస్టఫోన్ ఎడ్వర్‌టైజుమెంటు బొమ్మ ఉన్న పేజీమీద, అలాగే మత్తుగా వొరిగి చక్కా వూరుకున్నాడు.

ఒంటరిగా వుండగా చూచుకుని, డాక్టరు సోనారాణికి దగ్గరగా కూచుని విలాసంగా ఆమెవంక చూస్తున్నాడు. ఉన్నతమైన ఆమె వక్షస్సు టేబిలు అంచున తాచుకుని, పక్కలకి బాగా పొంగారి, ఆమె నున్నని మెడకిందివరకూ చిక్కగా కమ్ముకుపోతోంది.

ఆ వొత్తిడికి బాగా వొరుసుకున్న రొమ్ములనడుమ, మెడకి దిగువని, సిల్కు జంపరు పలకల కత్తిరింపుల కూడలిలో, ఏర్పడిన సన్నని లోయలోనించీ యౌవనపు మిసమిసలు తొంగిచూస్తున్నాయి. బోయ్ గుర్రుకొడుతున్న చప్పుడు వినపడగానే సోనారాణికి కళ్ళు తెరుపులుపడ్డాయి. మాటిమాటికీ మూతలు పడుతున్న ఆకనుగొలుకుల్లో రెపరెపలాడేది నిద్రాశేషమో, లేకపోతే యౌవనపు మైకమో, స్పష్టంగా చెప్పలేము. ఆ చూపుల్లో అసలు అతను వొచ్చినందుకు బులపాటమూ, ఆలస్యంగావొచ్చినందుకు అలకా, పెనుగులాడుతున్నాయి. అతను సర్దిచెప్ప బోయాడు. ఆమె వారించింది. ఇద్దరూకలిసి నిశ్శబ్దంగా ఏటిగట్టుకి నడిచివెడుతున్నారు.

"నేనేమో మధ్యాహ్నంనించీ తలనెప్పి అని వంకబెట్టి చూస్తూకూచోవాలి – నువ్వు మాత్రం వాళ్ళంతా వెళ్లిన గంటకి – టింగు రంగా అంటూ..."

"ఎలామరి? పెందరాళేవస్తే, తీరా వాళ్ళంతా ఇంకాబయలుదేరకండా వున్నట్టయినా, నన్నుకూడా బలవంతపెట్టి తీసుకుపోతారాయెను – అంచేత వొక ఘడియ ఆలిస్యమయినా, వాళ్లీపాటికి నాకోసం ఎదురు

చూడడం మానుకుని థియేటరుకి వెళ్ళిపోయి వుంటారని ధైర్యం చిక్కంతరవాత చక్కా వచ్చాను. చూడు..." ఎంతసేపటినించో వల్లె వేసి కంఠస్థం చేసినట్టు వప్పగిస్తున్నాడు.

సమాధానపడింది.

పక్కనే నడుస్తున్న అతని నడుముచుట్టూ తన చేతులు పెనవేసి తలపైకెత్తి నవ్వుతో చూచింది అతనివంక. అతని మనస్సు కుదటపడింది.

మళ్ళీ నిశ్శబ్దం.

దగ్గర పడుతున్న మధురక్షణాలు పాడే స్వాగత గీతికి ఆ రెండు హృదయాలూ శ్రుతికలుపుకుంటున్నాయి. ఎన్నాళ్ళనించో విశ్వప్రయత్నాలు చెయ్యగా చెయ్యగా, [illegible]కి విరబూసిన కోరికల గుబాళింపుల్లో ఉక్కిరిబిక్కిరవుతున్నారిద్దరూనూ. ఏటిలో దొరువుల పక్కని వొంటికాలిమీద నిదరబోతున్న బాతులు తొలకరివానకి రెక్కలు చాచి, చెల్లాచెదరై కాళ్ళ కడ్డంపడుతున్నాయి; ఏటి కవతల కోరడి పక్కని తమలపుతీగెలు కాళ్ళకివేసిన సంకెళ్ళు విదిలించుకుని, వేళ్ళాడే మర్రివూడల చాటుని, ఇసకలో, మసకలాడే నాగుపడగల మెలికల్లా, ముసిముసి నవ్వుల్లో, అంతులేని గుసగుసల్లో,

కరిగిపోయే ముద్దులలో కన్నుమూశారు; పక్క తోటలలోనించీ పరువుకొచ్చిన నిమ్మపళ్ళవాసన ఇద్దరిరక్తంలోనూ సమానంగా పనిచేస్తూంది.

'రాజూ!'

ఆమె నున్నని చెంపలూ, పెదిమలూ, తాకుతున్నాడు వేళ్ళతో. మాటలు భరించలేని మైకంలో అతని చైతన్యం మునకలు వేస్తోంది.

'రాజూ – ఒక్కమాట అడుగుతాను.'

'ఒకటికాదు పది అడుగు.'

'చూడు – నామీద నీకెందుకింత ప్రేమ? నీకో అని అడగకు!'

ముందరికాళ్ళకి బంధం!

'చెప్పనా?'

'చెప్పు.'

'ఒకటి నీ లావణ్యం.'

'రెండు?'

'నీ యౌవనం.'

'మూడు?'

'నీరసికత్వం – ఇందులో అన్నీవస్తాయి.'

'సరేగాని – మీఆవిడ ఎలావుంటుంది నీకు?'

'కమలా ? నీరూపురేఖలముందు దిగదుడుపు — నీ చెలాకీ ఎక్కడ, నీ — — '

'అంటే కమల వొట్టిచచ్చు పీనిగన్నమాట ? అంతేనా ?'

కిక్కురుమనదు-కోపంగా అడుగుతోన్నట్టుంది — ఎందుకనో ?

'అయితే రాజూ, కమల అంత అసహ్యంగా వుంది గాబట్టి — నా అందం చిందిపోతూ అవుపించిందన్నమాట నీకు — అంతేగా — —'

'ఛీ — అదికాదు — '

'కాదేమిటి ? చచ్చు అందాలముందు అందమనిపించుకునే అందమన్నమాటనాది — అంతేనా ?'

'ఛ — నీకూ దానికీ సహాపత్యమేమిటి ?'

'కమల ఏ మాత్రం అందంగావున్నా నావంక చూడకపోదువు. అవునా ?

'అహోరించినట్టుంది.'

ఇలా తిరిగిందేమిటి ?

సళ్లుతున్న కౌగిలి లాలనగా బిగించి గట్టిగా అదుముకుంటున్నాడు — బుజ్జగిస్తో.

'నిజం చెప్పమంటావా రాణీ ?'

'అంటే ఇందాకటినించీ అబద్ధాలు చెబుతున్నా వన్నమాట.'

గతుక్కుమన్నాడు.

'నిజానికి కమలకూడా చాలా రూపసి.'—

ప్లేటు మార్చాడు.

'చాలా రూపసి?'

'చాలా చురుకైంది – సరేనా?'

'చెప్పు ఇంకా –'

'అదుగో నీతో ఇదేచిక్కు ... ...'

సముదాయిస్తున్నాడు.

'ఎంతయినా నిన్నుమించే అందం కాదుగా.'

మాట్లాడదు.

ఏమిటీబాధ? ఇంకా ఏమిటీ అభ్యంతరం?

'మరి నేనెందుక్కావలసి వొచ్చాను?'

దొరికాడనుకుంది.

'నీ అందం వేరు.'

'అంటే?'

'నీదగ్గర ప్రత్యేకమైన ఆకర్షణ ఏదో—అయినా ఈ ఆరాలెందుకు?'

'సరిగ్గా నాకుమల్లేనే స్మ్రె నువ్వుకూడా.'

'ఎందులో ?'

'మా ఆయనా చక్కనివాళ్ళలో లెక్క పెట్ట వలసినవాడు – కాదనలేవు; అవునా ?'

'చుంచు మొహమూ వాడూను.'

'అలా అనకు. ఆ చురుకుతనమూ, ఆ తెలివి తేటలూ – –'

'కమల రూపసి.' అన్నం'కుకు కసితీర్చుకుంటోంది.

'నాకు నమ్మకం లేదు లే – రాణీ'

'దేనిమీద ?– అదుగో మొహం చిట్లించకు ?.'

'నువ్వు అనేమాటమీద నీకు విశ్వాసముందని.'

'ఎంచేత ?'

'మొగుడిమీద అంత వ్యామోహముంటే నాదగ్గర కెందుకొచ్చావు ?'

'నీ ఆకర్షణవేరు. టెన్నిసు ఆడేటప్పుడు పాయింటు పోయినా నువ్వు బ్యాట్ విసిరేటప్పటి గ్రేస్ చూచి—సరేనా?' మెడచుట్టూ వెచ్చగా ముద్దులు పెట్టేసుకొంటో, చేసిన గాయాలకి చెప్పకండా మందుజల్లేస్తోంది.

'అయితే రాజూ, కమలకంటే నాలో అదనంగా వున్న ఆకర్షణ ఏమిటంటావు ?'

'రసికత్వం.'

'అంటే నలుగురి కానందమిచ్చి నాలుగు రకాల అనుభవించగలగడ మన్నమాట—అంతేనా ?'

'అంతే.'

'తెలీకడుగుతాను-రసికత్వమంటే చలాకీ, తెలివీ, చమత్కారమూ, గట్రా - - అవునా ?'

'అన్నీని.'

'చురుకుతనమూ, చమత్కారమూ, హొయలూ, సుగుణాలే నంటావా ?'

'తప్పకండా.'

'అయితే రసికత్వమూ సుగుణమే కావాలి.'

'అయితే అవుతుంది – దేనికీసాద ?'

'ఏమిటోనోయ్ రాజూ, నే నేదో పాపకూపంలో పడిపోతున్నాననీ, చెడిపోతున్నాననీ, ఇదిగా వుంటుందోయ్.'

'ఛ – నువ్వు చెట్ట మేమిటి ? నువ్వు శృంగార రసాధిదేవతవు – నువ్వు వరాలు గుప్పిస్తే, నీ పాదాల దగ్గర దేహీ అంటూ... ...'

'చాల్లే కవిత్వం.'

ఇక సందేహాలన్నీ తీర్చేశా ననుకుంటున్నాడు.

'అయితే రాజూ —'

మళ్ళీ మొదలు. వినిపించుకోడు.

'ఇవాళ నువ్వూ నేనూ లేక టెన్నిసుకి Hands తక్కువై పోయాయిస్మీ'

అమ్మయ్య, సంభాషణ మార్చింది.

'మీ ఆయనకి పూసు పోలేదు గావును.'

'కమల్ని ఆడమన్నాను.'

'కమలా? దాని కాట రాదుగా?'

'ఏదో —'

'అయినా అది అలా ఆడదు. దానికి నచ్చవు మొగాళ్ళతో ఆటలంటే.'

'అవును. ఎప్పుడూ ఆ చివర వారదిగకూచుని ఏ ఇలస్ట్రేటెడ్ వీక్లీ మేగజీనో చూస్తూ కాలక్షేపం చేస్తుంది.'

'అసలు వీళ్ళెవళ్ళతోనూ మాట్లాడనే మాట్లాడదు.'

'అవును. మంచి నిదానమైనపిల్ల.'

'చాలామంచిదిలే — అసలు వాళ్ళ సిస్టర్సు అందరూ అంతేలే.'

'ఎవరు?'

'రాచర్లవారి ఫేమిలీ ఎరగవూ? అగ్నిహోత్రం లాంటి కుటుంబంలే.'

'కాని, ఆడతావా అని అడగ్గానే వొప్పేసుకుందిస్మీ.'

'నువ్వు బలవంత పెట్టి వుంటావు.'

'ఛ — నాకెందుకూ? అయినా, రాజూ, నాకెందుకులే? అడగనా ఒకమాట? నీకో్కపమొస్తుందేమో.'

చిలిపిగా నవ్వుతోంది.

'ఛ — అడుగు.'

'కమలకిమాత్రం రసికత్వం లేదంటావా? తెలివీ, చురుకూ, ఆకర్షణా అన్నీ వున్నతరవాత ——'

'అది అల్లాంటిదికాదు, నాకు బాగా తెలుసు. నేనంటే —— ——'

మొగాళ్ళింతేగా! కిసుక్కున నవ్వింది. అతనికి విసుగ్గావుంది.

'రాజూ, నీకెందుకంత వుక్రోషం? నాలోవున్న రసికత్వాన్ని ఆరాధించగలవాడివి, కమలలో——'

'రాణీ, నీకు మతిపోతోంది.' సీరియస్‌గా అంటున్నాడు.

మళ్ళీ నిశ్శబ్దం.

'అసలు ఎంతో బలవంతమిస్మాదగాని దాన్ని క్లబ్బులో చేర్చలేకపోయాను తెలుసా ?'

'రాజూ, నువ్వు ఎంత అసందర్భంగా మాటాడుతున్నావో నీకు తెలీడంలేదు.'

మళ్లీ ఇరుక్కున్నాడు.

'నేను రసికురాల ననీ—'

'కాదన్నానా ?'

'నిన్ను స్వర్గానికి పిలుచుకు పోవడానికి వొచ్చిన దేవత ననీ—'

'పిలుచుకుని వెళ్ళి ఆనందానికి హద్దులు చూపించ గలవనీ—'

'అంచేత నీ కెంతో గొప్పగా అవుపిస్తున్నాననీ వొప్పుకున్నావ్.'

'అవును.'

'మరి — స్థబ్దుగావుండి, పీనాసిగా నీ వొక్కడి మీదనే కళ్ళు పెట్టుకునివుండి, మహాపతివ్రతలా వుండడమూ, ఒక గొప్పేనని చెప్పుకుంటో పోతున్నావు, అవునా ?'

కొంప మునిగింది – లోపల పూ మధన పడుతున్నాడు – సర్దుకోవడ మెట్లాగా అని – ఈ ధర్మ సందేహాలు తనకెప్పుడూ రాలేదే?

'చెప్పు, ఏదినిజం?' – జబ్బలు కోపంగా పూయిస్తో అడుగుతోంది.

'ఏమిటోనబ్బ – నాకు తెలియదు. రసికత్వమంటే సుగుణమో, దుర్గుణమో, నేను చెప్పలేను – అది నీకూ_వాలి; నాకూ_వాలి; – ఎందుకొచ్చినగోల?— ఇద్దరమూ హాయిగా——అయినా, సుగుణాలు చూచి అసలు మోహించడమంటూ——'

'తప్పించుకోకు.'

'వెధవమాటలు – వొట్టి మూగమాటలు – అర్థమయి చస్తాయూ వోపట్టాన్ని?– జంతువులు నయం. ఈ దిక్కుమాలిన ప్రస్తావన లేకండా – అయినా, తెలీకడుగుతాను - అర్థా లెందుకూ? వెధవగోల! ఆ అర్థాలేమిటో అనుభవించి యీడవక - చంద్రుడు గ్రహమో, వుపగ్రహమో, తెలిస్తేనేగాని వెన్నెటో హాయి అనుభవించలేమూ యేం?'

'అంటే, ఇందాకటినించీ, అర్థంలేనిమాటలు ఏది పీలైతే అది పూత్తున్నావన్నమాట, అంతేనా?'

నిజమంతే-మళ్లీ ఎందులోనో ఇరుక్కుంటున్నాడు! ఇందాకటినించీ ఏదినిజమా అనే ఆలోచనే పట్టలేదతనికి, ఏది చెబితే అనుకూలంగా వుంటుందా అనే ధ్యాసతప్ప.

'రాజూ'

ఇంకా వొదల్లేదు పిచ్చి. కమలంటే ఎందుకో ఈవిడ కింత దుగ్ధ - దానిమీద ఘట్టించిం దేమిటీ? కమల చెడ్డదని రుజువు చేసేందుకు మహా తంటాలు పడుతోంది - లేకపోతే తృప్తి వుండదు గావును—

'ఇవాళ కమల చాలా ఇష్టంగా ఆడిందిలే టెన్నిసు.'

'ఎవరితో?'

'చెప్పేనుగా. మా ఆయనతో.'

'నేను నమ్మను.'

'ఏమిటి నమ్మవు? మా ఆయనతో ఆడిందనా? ఇష్టంగా ఆడిందనా?'

'ఇష్టంగా ఆడిందని నీకెలా తెలుసూ?'

గాబరాగా అడుగుతున్నాడు.

'పోనీ, మా ఆయన ఇష్టంగా ఆడారు. సరేనా?. ఆయనకి కమలంటే ప్రీతేగా!'

'నీతో చెప్పేడా?'

'అవును. ఆసంగతి కమలతో నేను తరుచూ చెబుతో వచ్చానుకూడా.'

'అబద్ధం! నాతోటి కమల చెప్పకుండావుండదు-ను వ్విలాంటి మాటలు దానితో చెబుతున్న సంగతి నిజమే అయితే—'

'అప్పటినించీ, నేను కనిపెడుతున్నాగా, మా ఆయనంటే కమలకి కూడా — —'

'రాణీ—మనుష్యుల్ని నీ ఇష్టమొచ్చినట్టు అర్థం చేసుకుంటే, నా అభిమానం గాయపడుతుంది.'

తీవ్రంగా కోపమొచ్చిం దతనికి.

'ఇవాళ టెన్నిసు వుబలాటంగా ఆడిందని కాదు లే—ఇంకావుంది—నాకెందుకూ ఈకుమ్మరం?—పైగా వున్నమాటంటే — —'

'చెప్పూ—చెప్పాలి-చెప్పితీరాలి.' కుదిపేస్తున్నాడు.

'చెప్పనీ, తొందరపడకు – సాయంకాలమేమి జరిగిందో తెలుసా ?'

'ఏమిటి ?'

అతనిగుండె ఆగింది.

'నాట్యానికి వెళ్ళేముందు ఒక కారులో మొగాళ్లంతా చక్కా-బోయారు. ఇంజనీరు కార్లో

రావూ, రావుభార్యా, శర్మా, అతనిభార్యా ఇరుక్కున్నారు. నాకు తలకాయనెప్పిగా వున్నదని వుండిపోయాననుకో, కమలమాత్రం ఖాళీ లేదని వెనక్కి వుండిపోయింది.'

'నేను చెప్పలే? అది తోసుకుని వెళ్ళలేదు; రాసుకుని తిరగటమంటే దానికి సుతరామూ గిట్టదు. అందులోనూ అంత తొడతొక్కిడిగా - కార్లో - మొగాళ్ళతోటి——'

'ఆకారు క్రిక్కిరిసి పోయిందని కాదు — వెనక్కి తగ్గుతా.'

'మరి ?'

'మా ఆయన కారు ఖాళీగా వున్నదని.'

'ఎందులో ఎక్కింది చివరికి ?'

'మా ఆయన కార్లోనే — ఆయన పక్కనే —'

'నేను నమ్మను.'

'నమ్మకు. మనకి బాధగావుండే వన్నీ కూడా నమ్మకండా వుండగలగడం సాధ్యమైతే, నిశ్చలంగా, నిర్భయంగా... ఇప్పుడు బవుశా, మాఆయనా కమలా థియేటరులో ఒకళ్ళపక్కని ఒకళ్లు కూచుని, కిలకిల

లాడుతూ వుంటారులే, అబ్బో, ఆయన సంగతి తెలియదూ నాకు ? సమయం చిక్కితే——'

'ఛ—ఏమిటీ ?' అతని మొహం జేవురించింది.

'రాజూ, నీ పిచ్చిగాని, కమలానికి మాత్రం మా ఆయన్ని ఇలా ముద్దుపెట్టుకోవాలని వుండదూ ? ఆయనా రసికుడే—నాకు తెలీదూ?' గట్టిగా హత్తుకుని అతని పెదిమలు కసిదీరా ముద్దుపెట్టుకుంటోంది.

భగభగమంటున్న రోషాగ్నిలో వొక స్త్రీ తనంతట తానిచ్చే కౌగిలిలో వుండే తీపిని నిష్కారణంగా వొదులుకుంటున్నాడతను.

చీకట్లో సోనారాణికి తెలియటంలేదు.

'అయినా, రాజూ ఇటుచూడు — కమలనీ మా ఆయన్నీ మెల్లిగా కలిపేస్తే—మనమిద్దరమూ— హాయిగా—విచ్చలవిడిగా——'

గారాలు కుడుస్తోంది.

ఛెళ్ళున లెంపకాయ కొట్టాడు.

'దుర్మార్గుడా !'

మళ్ళీ వెనక్కితిరిగి చూడలేదతను. తిన్నగా థియేటరుకి వెళ్ళాడు కార్లో. నాట్యం సగమయిందో లేదో, కమలని రమ్మనమని, చప్పున కార్లో

ఎక్కించుకుని, సరాసరి ఇంటికి తీసుకుపోయాడు. మాటా లేదు మంతీ లేదు. కారణం చెప్పడు !

మర్నాడు డాక్టరు రాజూ, కమలా, ఇద్దరూ, క్లబ్బు మెంబర్షిప్‌కి రిజైనిచ్చారు. ఎందుకో ఎవళ్ళకీ బోధపడలా.

*** "అపస్వరం" ***